# భగవంతుని నామస్మరణతోనే మోక్షం

## -మంత్రాలయపీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి

తిరుమల, నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి:



కలియుగంలో భక్తులు నిరంతరం భగవంతుని నామస్మరణతోనే మోక్షం లభిస్తుందని మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి తెలిపారు. సనాతన ధార్మికవ్యవస్థ పట్ల విశ్వాసం, సద్గ్రంథాల పఠనంతో దేవుని దగ్గరగా చూడగలుగుతారన్నారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థస్వామి తన శిష్యులతో కలిసి శనివారం ఉదయం తిరుమలకు విచ్చేశారు. మహాద్వారం నుంచి ఆలయంలోనికి చేరుకున్న స్వామివారికి టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ రమేష్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు స్వాగతం పలికారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త




# తిరుచ్చిపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

చంద్రగిరి, నవంబర్ 12 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారు శనివారం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీనివాసుడు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగ మోక్తంగా నిర్వహిం చారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను ఆలయ అర్చకులు వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరు చ్చిపై స్వామివారు తన దేవేరులతో తిరుమాడవీధులలో విహరించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఎఈఓ గురుమూర్తి, సూపరిం టెండెంట్ మునిచెంగ ల్రాయులు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రభాకర్, అర్చకులు మురళి, జమేధర్ చిరంజీవులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తెలిసిన

# జననేత జగన్

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి రోజా



పత్తి పుత్తూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి రోజా

వడమాలపేట,, నవంబరు 12 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని మంత్రి రోజా పేర్కొన్నారు. శనివారం మండలంలోని పత్తి పుత్తూరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల కష్టాలు తెలిసిన జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ లోకేశ్వర్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, ఆవుల ప్రతిమ సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణుకాకిరణ్, నందయ్య, చైతన్య, శేఖర్, కరుణాకర్‌చౌదరి, ఉమాపతి, మునిబాబు, వెంకటేష్, యాదవేంద్రారెడ్డి, తులసిరామిరెడ్డి, వెంకటరెడ్డి, మదన్మోహన్‌రెడ్డి, వేణు, బాల, సర్పంచ్‌లు తులసి, అంజమ్మ, శ్రీ విద్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించి ప్రారంభించాలంటూ

# సచివాలయానికి జడ్పీటీసీ తాళం

## అదుపులోకి తీసుకున్న పోలీసులు



వడమాలపేట మండలం పత్తి పుత్తూరులో వైసీపీ విభేధాలు రచ్చకెక్కాయి. సొంత పార్టీ నేతల నుంచే నిరసన ఎదురైంది. శనివారం మంత్రి రోజా పత్తి పుత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది. కాగా నియోజకవర్గంలో అసమ్మతివర్గంగా ఉన్న జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి పెండింగ్ బిల్లులు రూ.25 లక్షల రూపాయలు చెల్లించాకే ప్రారంభించాలంటూ భవన గేటుకు తాళం వేశారు. రెండేళ్ళ క్రితం పత్తి పుత్తూరులో సచివాలయ భవన నిర్మాణానికి రూ.35 లక్షల రూపాయలు మంజూరైంది. నామినేషన్ మీద మురళీధర్‌రెడ్డి తండ్రి కాంట్రాక్టర్‌గా గత ఆరు నెలల క్రితం భవనం నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఇంకా 25 లక్షల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో భవనాన్ని మంత్రి రోజా శనివారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాల్సినదిగా అధికారులను ఆదేశించారు. అయితే బిల్లులు వచ్చిన తరువాతే ప్రారంభోత్సవం పెట్టుకోండని చెబుతూ సచివాలయానికి మురళీధర్‌రెడ్డి తాళం వేశారు. దీంతో అధికారులు, శ్రీకాళహస్తి డీఎస్పీ విశ్వనాథ్, వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు, మురళీధర్‌రెడ్డితో చర్చలు జరిపారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు బలగాలను పత్తి పుత్తూరుకు తరలించారు. ఎంత నచ్చచెప్పిన మురళీధర్‌రెడ్డి ఒప్పుకోకపోవడంతో వైసీపీ నాయకులు గేటు తాళాలు పగులగొట్టారు. దీంతో నాయకుల మధ్య వాదోపవాదాలు, తోపులాటలు జరిగాయి. పోలీసులు మురళీధర్‌రెడ్డిని బలవంతంగా అదుపులోకి తీసుకుని తరలించారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో లీకేజీ!

## చిత్తడిగా మారిన ఆలయం - ఆందోళనలో పాలకులు

**శ్రీకాళహస్తీశ్వరాలయం చిన్నపాటి వర్షాలకే ఉరుస్తుంది.ఈ సమస్యతో కోట్లు వెచ్చించి తయారు చేసినబంగారు తాపటం ఉత్సవ వాహనాలకు ముసుగులు ధరింపజేసి కాపాడాల్సిన దుస్థితి చోటు చేసుకుంది. గతంలో మూడుసార్లు లక్షలు వెచ్చించి మరమ్మత్తులు చేపట్టారు.కానీ ప్రయోజనం లేదు.ప్రస్తుత పాలకులు గత నెల రోజులుగా లీకేజీలకు సంబంధించి ఆందోళన చెందుతున్నారు. ఇక తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి ఢిల్లీలో పురావస్తు శాఖ అధికారులతో చర్చించారు.శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి తిరుపతి ఐఐటి అధికారులను రప్పించారు. పరిశీలనలు జరిపారు. అయితే పరిశీలనలు ఇంకా పరిశీలనలుగా ఉన్నాయి.**

శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త

పురాతన ఆలయం. శతాబ్దాల నాటి కళాఖండం. భావితరాలకు సంప్రదాయాల్ని, సంస్కృతిని అందించే మహా కళాఖండానికి నేడు ప్రమాదం పొంచి ఉంది. రూ.లక్షలకు లక్షలు వెచ్చించి ఎన్నిసార్లు మరమ్మత్తులు. కాంట్రాక్టర్ల జేబులు ఫుల్. ఫలితం నిల్. శ్రీకాళహస్తీశ్వరాలయం కురుస్తున్న వర్షాలకే ఉరుస్తోంది. ఆలయం గొడుగులా మారి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్లు వెచ్చించి తయారు చేసిన బంగారు రథాలకు ముసుగులు ధరించి వర్షం నుంచి కాపాడే పరిస్థితి చోటు చేసుకుంది. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం పుణ్యక్షేత్రం ఆంధ్రరాష్ట్రంలోని చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి. ఈ దివ్యక్షేత్రంలోని శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని చారిత్రక ఆధారాలను బట్టి చోళ, పల్లవుల కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. 1905 లో తమిళనాడుకు చెందిన నాటుకోటు చెట్టియార్లు రూ.10లక్షలు వెచ్చించి జీర్ణోద్దారణ గావించారు. అతిపురాతన ఆలయం వంద సంవత్సరాల వరకు నిర్మాణం చెక్కుచెదరలేదు. ఆలయంలోపల రాతికట్టడాలు నాటి ఇంజనీరింగ్ నైపుణ్యాలు. నాణ్యతకు తార్కాణంగా ఉన్నాయి. అయితే ఉపరితలంలోని శ్లాబ్‌కు 20 సంవత్సరాల్లో మూడు సార్లు మరమ్మత్తులు చేసినా ప్రయోజనం శూన్యం. పురాతన కాలంనాటి కట్టడాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. దీని పరిరక్షణపై దృష్టిపెట్టాల్సిన అధికారులు 'టేకిట్ ఈజీ'గా వ్యవహరిస్తుండగా, పర్యవేక్షించి, పరిశీలించి పరిరక్షించాల్సిన పురావస్తుశాఖ తిరిగి చూడటం లేదు. ఇదే నిర్లక్ష్యం 1516లో శ్రీకృష్ణదేవరాయులచే నిర్మించిన చారిత్రక కట్టడం రాజగోపురంను కాలగర్భంలో కలిసిపోయేటట్టుచేసింది. ఆలయ ఆదాయాలు, భక్తుల మనోభావాలను వ్యాపార రంగంగా మలచుకుంటున్న దేవాదాయశాఖ ఆలయ పరిరక్షణపై దృష్టి సారించకపోవడం దురదుష్టకరం.





వర్షాలకు ఉరుస్తున్న ఆలయం, ఆలయంలో లీకేజీలు

### కొద్దిపాటి వర్షానికే..

పురాతన శ్రీకాళహస్తీశ్వరాలయం కొద్దిపాటి వర్షానికే పై కప్పు నుంచి ఉరుస్తోంది. గతంలో ఆలయం తూర్పు భాగంలో ఆలయ ప్రహరీపక్కన భక్తకన్నప్ప కొండను తొలచి రోడ్డు నిర్మించారు. దాంతో ఆగోడ నుంచి నీళ్ళు లోపలికి ప్రవేశించాయి. దీంతో ఆలయం నీళ్లకుండలా మారింది. దీనిని అరెస్టు చేయడానికి నేటి ఇంజనీరింగ్ విభాగం లక్షలకు లక్షలు వెచ్చించారు. గోడపక్కన కాలువ నిర్మించారు. పురాతన కాలంలో కైలాసగిరి అనబడే కన్నప్ప కొండను తొలచి ఆలయం నిర్మించారు. వందసంవత్సరాల పాటు పెద్దపెద్ద తుఫాను వర్షాలు, నెలల తరబడి వర్షాలకు కూడా ఆలయంలో నీటిబొట్టు వచ్చేది కాదు. అలాంటిది ప్రస్తుతం కొద్దిపాటి వర్షాలకే ఆలయం లోపల, ప్రాకారంలోని మండపాలు "ఓటి కుండల్లా" మారాయి. ఇటీవల రూ.కోటి వెచ్చించి జీర్ణోద్ధారణ గావించిన "మణికంఠేశ్వరాలయం" కూడా ఉరుస్తుందంటే పనుల్లో నాణ్యత ఏపాటిదో అర్థమవుతోంది.

# రాజీతోనే రాజమార్గం

## లోక్ అదాలత్‌ల ద్వారా సామరస్యంగా కేసుల పరిష్కారం - జిల్లా జడ్జి భీమారావు




చిత్తూరు, నవంబర్ 12 ప్రభాతవార్త

రాజీ చేసుకోగలిగిన క్రిమినల్, సివిల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు ఇ.భీమా రావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంను జిల్లా జడ్జి భీమారావుతో పాటు ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎన్.శాంతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వై.కరుణకుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి భానుశేఖర్‌రెడ్డి, అదనపు ఎస్పీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ సుప్రీం కోర్టు న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనదేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఏ బంధానికైనా నమ్మకమే ప్రధాన మని, చిన్న చిన్న గొడవలను ఓర్పుతో పరిష కరించుకోవాలే తప్ప కోర్టు వరకు రాకూడదన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై. కరుణకుమార్ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని భావించి కక్షిదారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకోవాలన్నారు. ఆవేశాన్ని పక్కనపెట్టి రాజీ ప్రయత్నం చేసుకుంటే మంచి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఎక్సైజ్, పోలీసు, వైద్యఆరోగ్య శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. కార్య క్రమంలో న్యాయవాదులు, డిఎస్పీలు, కోర్టు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, భీమా, చిట్‌ఫండ్ సంస్థల అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

# జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ అరెస్ట్, విడుదల



మాట్లాడుతున్న జనసేన నాయకులు

నగరి, నవంబరు 12 ప్రభాతవార్త :

మంత్రి రోజాపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడు కిరణ్ రాయల్‌ను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది. మంత్రి రోజాపై సోషల్ మీడియాలో అసభ్యకర వీడియోలను కిరణ్‌రాయల్ పోస్ట్ చేయడంతో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం రాత్రి కిరణ్‌రాయల్‌ను అరెస్ట్ చేశారు. సెక్షన్ 327 కింద కేసు నమోదు చేసినట్టు సిఐ శ్రీనివాసంతి తెలిపారు. శనివారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరచగా కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# కాణిపాకంలో రెండోరోజు పవిత్రోత్సవాలు



కాణిపాకం, నవంబర్ 12 ప్రభాతవార్త:

శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం పవిత్రోత్సవాలు, మండల పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. రాష్ట్రంలో వర్షాలు సక్రమంగా కురిసి పాడి పంటలతో భక్తులు, రైతులు సస్యశ్యామలంగా వుండాలని, ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, భక్తుల అభీష్టాలు సిద్ధించాలని ఆలయంలో ఏటా వలె పవిత్రోత్సవాలను శుక్రవారం నుండి నిర్వహిస్తు న్నారు. ఈమేరకు రెండో రోజు ఆలయంలో పవిత్రోత్సవాలతో పాటు ప్రధాన ఆలయం కుంభాభిషేకం జరిగి 40 రోజులు పూర్తికావ దంతో మండల పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. కార్యక్రమానికి కావలసిన పూజాసామాగ్రిని ప్రధాన ఆలయం నుండి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఆలయ అధికారులు, ఉభయదాతలు అలంకార మండపం వద్దకు తీసుకువచ్చారు.



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో స్వామివారు శనివారం సాయంత్రం ఉభయదేవేరులతో కలసి స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

వార్త మెయిన్‌లో

### ఉష్ణోగ్రతలు

11/11/2022



- తిరుపతి 25 డిగ్రీలు
- చిత్తూరు 26 డిగ్రీలు
- మదనపల్లి 20 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 25 డిగ్రీలు
- వెంకటగిరి 27 డిగ్రీలు
- గూడూరు 27 డిగ్రీలు

# వర్షపాతం అంతంత మాత్రమే

## తిరుపతి జిల్లాలో 9 మండలాల్లో తక్కువ వాన
## అధిక వర్షపాతం కురవాల్సిన చోట అత్యల్పం
## తడ ప్రాంతంలో ఉప్పు నీటితో రైతులకు ముప్పు




తడ, నవంబర్ 12 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో వాయుగుండం, విరామం లేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ తిరుపతి జిల్లాలో ఇప్పటికీ కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అల్పపీడనం హడలెత్తించినా తగినంత వాన కురవకపోవడంతో రైతన్నలు కరువు భయంతోనే వ్యవసాయం పనులు చేసుకుంటున్నారు. మొత్తం 34 మండలాలు తిరుపతి జిల్లాలో ఉండగా అందులో తొమ్మిది చోట్ల తక్కువ వర్షపాతం నమోదైంది. శనివారం జిల్లా అధికారులు తెలిపిన వివరాల మేరకు తడ, వెంకటగిరి, దక్కిలి, కోట, చిల్లకూరు, పిచ్చాటూరు, కేవీబీ పురం, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదై ఉంది. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటిదాకా కురిసిన వర్షపాతాన్ని అధికారులు లెక్కలు వేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరి, ఇతర పంటలు వేసుకునే రైతులు కొన్నిచోట్ల ఇప్పటికీ సాధారణ వర్షపాతం కూడా కురవకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి తడ మండలం వంటి తీరప్రాంతంలోనే ఈసారి వర్షం అతి తక్కువగా కురవడం విశేషం. ఈ మండలంలో తిరుపతి జిల్లాలోనే అత్యధికంగా వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జూన్ నుంచి ఇప్పటిదాకా 898.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం తడలో నమోదు కావాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ఈ మండలంలో కేవలం 690.0 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైనట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఈ ఒక్క మండలంలోనే 23.2 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం విశేషం. ఒక్క నవంబర్‌లోనే తడలో 396.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఇది జిల్లాలోనే అత్యధిక సాధారణ వర్షపాతంగా ఉంది. అయితే శనివారం నాటికి ఈ సారి ఇక్కడ ఈ నెలలో కేవలం 220.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నవంబర్ నెల అంటేనే తుపాను మాసంగా పేరు. తుపాను వస్తే అత్యధికంగా వర్షం కురిసి చెరువులు, నదులు, పంట కాలువలు ముంచెత్తే రోజులు ఇవి. అయితే ఈ సారి ఆ వాతావరణం కనిపించడం లేదు. కాళంగి నదిలో నీళ్ల వేగంగా ప్రవహించి అందులోని ఉప్పునీటిని అంతే వేగంతో పులికాట్ సరస్సులో కలిపేసే నవంబర్ నెల భారీవర్షం కోసం ఇక్కడి రైతులు ఎదురు చూస్తుంటారు. ఈ సారి ఇప్పటికీ కాళంగి నది ప్రవాహం కనిపించకపోవడంతో ఉప్పు నీటి సరస్సులోని నీళ్ల మంచినీటి నదిలో కలిసి వ్యవసాయానికి ఉపయోగం లేకుండా పోయాయి. ఇటీవల ఈ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించి వచ్చిన తర్వాత ఈ వ్యవసాయ సీజన్‌లో పనులు జరపడం సాధ్యం కాదని తేల్చేశారు. అధికారులు పనులు జరిపించకపోయినా కాళంగి నీళ్ల ప్రవాహం పెరిగితే ఆ వరదకు ఉప్పు నీళ్ల వెళ్లిపోతాయని మాత్రం రైతులు ఆశిస్తున్నారు. అంతపెద్ద వాన రావాలని కోరుకుంటున్నారు.

# మరో రెండు రోజుల పాటు వర్షాలు

## ప్రజలు.. అధికారులు మరింత అప్రమత్తం !!

చిత్తూరు, నవంబర్12 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో ఈనెల 15వతేది వరకు వర్షాలు కురుస్తాయని కలెక్టర్ ఎం.హరినారాయణన్ పేర్కొన్నారు. వర్షాలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హరినారాయణన్ శనివారం వర్షాలపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేశారు. వాగులు, వంకలు, చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని నీటి నిల్వ సామర్థ్యం ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా సమర్థవంతంగా విధులు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశామన్నారు. మండల కేంద్రాల్లో సైతం కంట్రోల్ రూంలు ఏర్పాటుచేసి అధికారులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అధికారులు సత్వరం జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూంకు సమాచారం అందించాలని ఆదేశించారు.

### బంగారం ధరలు

11/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,892

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,337

### కోడిగ్రుడ్ల ధరలు

11/11/2022



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

# సంక్షేమ పథకాలతో మెరుగైన పాలన

**- ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపి రెడ్డెప్ప, జెడ్‌పి చైర్మన్**

పెద్దపంజాణి, నవంబర్ 12, ప్రభాతవార్త:



ప్రభుత్వం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని సంక్షేమ పథకాలతో మెరుగైన పాలన వైకాపా ప్రభుత్వం చేపడుతుందని ఎంపి రెడ్డెప్ప, జెడ్పి చైర్మన్, ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో భాగంగా మండలంలోని శంకరాయలపేట పరిధిలోని శివాడి గ్రామంలో వారు పర్యటించారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. వారు మాట్లాడుతూ టిడిపి నాయకులు ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలను చేస్తున్నారని వారు ఆరోపించారు. టిడిపి అధినేత అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థను తొలగించాలని ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని ప్రజల వద్దకు పాలనలో కీలకంగా ఉన్న సచివాలయ వ్యవస్థను తొలగించాలనే ఆయన ఆలోచనలో ప్రజలపై ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, జడ్పీటిసి శుస్మా బాగారెడ్డి, నాయకులు నాగశంకర్‌రెడ్డి, బాబురెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు డివిజన్ విఆర్‌ఓ సంఘం అధ్యక్షుడుగా రమేష్

పలమనేరు, నవంబర్ 12, ప్రభాతవార్త:



పలమనేరు రెవెన్యూ డివిజన్ విఆర్‌ఓల సంఘం అధ్యక్షులుగా ఎం.రమేష్‌ను జిల్లా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు బాలాజీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమీవేశంలో జిల్లా ఈసి సభ్యులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పలమనేరు పట్టణం, గంటావూరు విఆర్‌ఓ ఎం.రమేష్‌ను పలమనేరు రెవెన్యూ డివిజన్ విఆర్‌ఓల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## తులసినాథం నాయుడుకు కళామిత్ర పురస్కారం

పలమనేరు, నవంబర్ 12, ప్రభాతవార్త:



తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు కళామిత్ర రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు కళామిత్రమండలి అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషకు చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి 13 జిల్లాల నుండి 13 మందిని గుర్తించి పురస్కారం అందిస్తున్నామని, అందులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి తులసినాథం నాయు డును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 27న ఒంగోలులో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేత పురస్కారం అందించనున్నారని తెలిపారు. పురస్కారం ప్రకటించడంపట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు గురుమూర్తి, అబాదాలీ, చంద్రశేఖరయ్య, సుదర్శనాచారి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## బెదిరింపులకు భయపడేదిలేదు - ప్రతిఘటిస్తూనే ఉంటాం

–చల్లాబాబు

పుంగనూరు, నవంబరు 12 ప్రభాతవార్త :



పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి భవనాన్ని అద్దెకు ఇచ్చిన యజమానిని మున్సిపల్ కమీషనర్ అక్రమంగా బెదిరించి తమ కుర్చీలను బయటపడేశారని, ఈబెదిరింపులకు భయపడేది లేదని, ఎప్పటికపుడు ప్రతిఘటిస్తూనే ఉంటామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఈమేరకు ఆయన పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆందోళ నిర్వహించారు. కమీషనర్ భవన యజమానిని మూడుగంటలసేపు మున్సిపల్ కార్యాలయంలో నిర్బంధించి భయాందోళనలకు గురిచేశారన్నారు. వైకాపా నాయకులు చేస్తున్న ఈఅక్రమాలను గమనిస్తున్న ప్రజలు వచ్చేఎన్నికలలో బుద్ధిచెబుతారన్నారు.

## పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని మంత్రికి వినతి

రొంపిచర్ల 12 ప్రభాతవార్త



పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతి లోని ఆయన స్వగృహంలో మండల వైసిపి బీసీ సెల్ అధ్యక్షులు కోటా వెంకటరమణ కోరారు. మండలంలోని బోమ్మయ్యవారిపల్లె గ్రామ పంచాయతీలోని ఫజులపేటలో ఇళ్లపట్టాలు పంపిణీ పై ప్రజలకు హామీ ఇచ్చామని తెలిపారు. దీంతో మంత్రి తహిసి ల్దార్ మురాషావలికి ఫోన్ చేసి ఫజులుపేటలో పేదలందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే నర్వర్‌పేటలో రామచంద్రాపురం కాలనీలో ఇళ్లపైన ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు పోతున్నాయని వాటిని మార్పు చేయాలని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసకొనిపోయినట్లు చెప్పారు. విద్యుత్ లైన్లు మార్పు చర్యలు తీసుకొంటామని మంత్రి హామీ ఇచ్చారని కోటా వెంకటరమణ చెప్పారు.

## దారి దోపిడీకి పాల్పడింది వైకాపా నేతలే - తెదేపా ఆరోపణ

శాంతిపురం, నవంబర్ 12 ప్రభాతవార్త



తిరుపతి వద్ద దారి దోపిడీకి పాల్పడింది శాంతిపురం మండల వైకాపా నేతలేనని మండల టిడిపి అధ్యక్షు డు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపా నేతలే దోపిడీకి పాల్పడి 35లక్షలు కాజేశారన్నారు. స్వయానా వైస్ ఎంపిపి భర్త రమేష్‌తో పాటు కృష్ణమూర్తి హస్తం ఇందులో ఉన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి వారిని ప్రోత్సహిస్తోంది వైకాపా నేతలే అన్నారు. ఇంతవరకు వారిపై ఎందుకు చర్యలు చేపట్టలేదో చెప్పాలన్నారు. వైకాపా నేతలు కుప్పంలో యువతకు ఉపాధి కల్పించక దొంగతనాలు, దారిదోపిడీలకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రైస్ పుల్లింగ్ ఎవరు జరుపుతున్నారో ఆ పార్టీ నేతలే తెలపాలన్నారు. కుప్పాన్ని పులివెందులగా మారొ ్చద్దన్నారు. దారి దోపిడీకి పాల్పడ్డ వారికి వైకాపాకు సంబంధం లేదని ఎమ్మెల్సీ భరత్ పేర్కొనడం తగదని వారు భరత్, ఎంపి మిథున్‌రెడ్డితో కలసి ఉన్న ఫోటోలు చూపించారు. కార్యక్రమంలో నేతలు మణి, ఉయ్యాల జయరాంరెడ్డి, గోపాల్, నాగరాజు, పెద్దన ్న, నాగరాజు, సింగిరి శ్రీనివాసులు, రవి, రాజేంద్ర, చంద్రకళ, రుద్రప్ప, నారాయణస్వామి, సుగుణమ్మ, రమేష్, నారాయణ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కేసుల పరిష్కారానికే జాతీయ లోక్ అదాలత్‌లు

కుప్పం, నవంబర్ 12 ప్రభాతవార్త



కోర్టుల్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుటకే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను కోర్టులో నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సివిల్ జడ్జి కోర్టులో 30 సివిల్ కేసులను పరిష్కరించి 12.98 లక్షలు పరిహారం అందేలా ఆదేశాలు జారీ చేశారు. అలాగే అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సిసి కేసులు 58, ఎన్ఐ యాక్ట్ 20, ఎంసి కేసులు 3 పరిష్కరించారు. వీటిద్వారా 58.85లక్షల పరిహారంకు ఆదేశాలిచ్చారు. అలాగే 1509పిటి కేసులను పరిష్కరించి 3లక్షలు చెల్లించేలా ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీకాంత్, హరికృష్ణ, అనిల్‌కుమార్, కక్షిదారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాను కలసిన మైనార్టీ నేతలు

కుప్పం, నవంబర్ 12 ప్రభాతవార్త



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాను కుప్పం నియోజకవర్గ వైకాపా మైనార్టీ అధ్యక్షుడు సర్దార్ బాషా, నేతలు ఎఎం అలీ, అరబ్‌జాన్, ముజ్జుబాషా, ఏజాజ్‌లు కలిశారు. ఈసందర్భంగా కుప్పం నియోజకవర్గంలోని షాదీమహళ్లు, మసీదులు, స్మశాన వాటికల సమస్యలను డిప్యూటీసిఎంకు వివరించారు. అలాగే కుప్పంలో ఉర్దూ కాలేజ్‌తో పాటు ఉర్దూ స్కూళ్ల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. దీనిపై డిప్యూటీ సిఎం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, వక్ ్ఫబోర్డుకు సైతం తగు ఆదేశాలు ఇస్తామని డిప్యూటీసిఎం హామీ ఇచ్చినట్లు సర్దార్ బాషా తెలిపారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 25మంది ఎంపిక

కుప్పంరూరల్, నవంబర్ 12 ప్రభాతవార్త



కుప్పం పిఇఎస్ ఆస్పత్రి, లయన్స్ క్లబ్ అధ్వర్యంలో శనివారం కుప్పం పిఇఎస్ అర్బన్ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 80మంది శిబిరానికి హాజరుకాగావారికికంటిపరీక్షలునిర్వహించి 25మందిని ఉచితకంటిఆపరేషన్లకుఎంపికచేశారు. కార్యక్రమంలోలయన్స్‌క్లబ్‌అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, కోశాధికారి సెంధిల్‌కుమార్, డైరెక్టర్లు ప్రకాష్, లెనిన్, మతీన్, సురేష్, బాలు, విశ్వ, వైద్యులు పాల్గొన్నారు.

## కేంద్ర రైల్వేమంత్రిని కలసిన జగదీష్‌బాబు

కుప్పం, నవంబర్ 12 ప్రభాతవార్త



కుప్పం ప్రాంతంలో రైల్వే సమస్యలపై చిత్తూరు ఎం.పి. రెడ్డెప్ప అందించిన లేఖను సాయిమాతా సేవా ట్రస్ట్ జగదీష్‌బాబు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలసి అందించారు. కుప్పంలో వందేభారత్ రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని, అలాగే షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపింగ్ ఇవ్వాలని కుప్పం రైల్వే స్టేషన్‌లో ఎస్కవేటర్ ఏర్పాటుచేయాలని, గుడుపల్లె, మల్లానూరులో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. దీనిపై రైల్వే మంత్రి, అధికారులు మాట్లాడుతూ త్వరలోనే రైళ్ల స్టాపింగ్‌కు అనుమతులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌జిఎం సంజీవ్ కిషోర్, డిఆర్ఎం సునీల్, విశ్వనాథరెడ్డి, రాఘవశర్మ, భాగవతశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

రొంపిచెర్ల 12 ప్రభాతవార్త

ముత్యాలమ్మ గుడిలో శనివారం పూజలను ఆలయ అర్చకులు గుణశేఖర్ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి శుక్రవారం కుంకమార్చున, సేవ చేస్తామని ర్చకులు తెలిపారు. ఈపూజల్లో పాల్గొనే దంపతులకు అమ్మ వారికి జాకెట్, బోందరం, గాజులు కుంకము ఇవ్వాలని చెప్పారు. పూజలో పాల్గొనే దంపతులు సంప్రదాయ వస్త్రాలను ధరించాని సూచించారు. ఈ అవకాశన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, నవంబర్ 12 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకటహరచతుర్ధి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం నుండి సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో అలంకార మండపం కిక్కిరిసింది. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహ న్‌రెడ్డి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, తదితరులు పాల్గొన్నారు. ఉదయం9, 11 గంటలకు జరిగిన అభిషేకంలకు భక్తులు సుమారు 100 టిక్కెట్‌ల వరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కోటలో అక్రమ మోటార్లతో నీటి సరఫరా బంద్

కోట, నవంబర్ 12 ప్రభాతవార్త

మేజర్ పంచాయతీ కోటలో కొంతమంది అక్రమంగా పంచాయతీ కొళాయిలకు మోటార్లు ఉపయోగించి నీళ్లను తోడేస్తుండటంతో దిగుల ప్రాంతాల వారికి పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా జరగక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌జీఆర్ కాలనీలో గత 20 రోజులుగా నీటి సరఫరా లేక ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ మోటారు కనెక్షన్‌లను తొలగించాలని పలుసార్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ మోటార్ల వల్ల అందరికీ నీటి సరఫరా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని మేజర్ పంచాయతీ కోటలోని ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా జరిగేటట్లు చర్యలు తీసుకొని క్రిందిస్థాయి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ఆ ప్రాంతంలో బోరును వేసేందుకు పంచాయతీ తీర్మానం చేసిందని, బోరు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు వివరణ ఇచ్చారు.

## పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సిడిపిఓ సంషాద్ బేగం

వెంకటగిరిరూరల్ నవంబర్ 12 ప్రభాతవార్త:

వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్ వాడి పరిధిలో పిల్లల ఆరోగ్య విషయమై అంగన్‌వాడి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి సిడిపిఓ సంషాద్ బేగం అన్నారు. శనివారం ఐసిడిఎస్ కార్యాలయ ప్రాంగణంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రీ స్కూల్‌పై సమావేశం నిర్వహించారు. అయా అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో శిశు మరణాలు పూర్తి స్థాయిలో తగ్గించేందుకోసం అన్ని అంగన్‌వాడి కేంద్రాలల్లో గర్భిణిలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంతోపాటు ఆరోగ్య సూత్రాలు వారు పాటించే విధంగా కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అదేవిధంగా గర్భిణిలు రక్త హీనతతో బాధపడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలింతలు తీసుకోవాల్సి జాగ్రత్తలపై కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంతోపాటు వారి ఆరోగ్య స్థితిగతులు కూడా ఎప్పటికప్పుడు రికార్డుల ద్వారా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఉమ మహేశ్వరీ, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చినుకు పడితే రోడ్లు చిత్తడే

పట్టించుకోని అధికారులు –అవస్థల్లో స్థానికులు

వెంకటగిరిరూరల్ నవంబర్ 12 ప్రభాతవార్త:

వెంకటగిరి పట్టణంలోని 9వ వార్డు ఉపాధ్యాయనగర్ కాలనీలోని చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, పాలకుల దృష్టికి తీసుకొని వెళ్ళినా ఫలితం మాత్రం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండటంతో స్థానికులు తమ సమస్యకు పరిష్కారం లేదా అని నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా అ ప్రాంతంలోని విద్యార్థులు స్కూళ్ళకు వెళ్ళ లేక పోతున్నట్లు వాపోతున్నారు. అంతే కాకుండా రోడ్డు మార్గంలో నడవాలన్న ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకులు దృష్టి ఉంచి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టాలని స్థానిక 9వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

## లోక్ అదాలత్‌లో సత్వరమే న్యాయం

కోట, నవంబర్ 12 ప్రభాతవార్త

లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ చెప్పారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని కోట కోర్టు ప్రాంగణంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న క్రిమినల్, సివిల్ తగాదాలు, కుటుంబ వివాదాలు, చిన్న చిన్న కేసులను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో క్రిమినల్, సివిల్ కేసులు కలిపి 35 కేసులు రాజీ కాగా, 467 పిటి కేసులు రాజీ అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, కోట, వాకాడు, చిట్టమూరు పోలీసులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో విఆర్‌ఒ మృతి

చిల్లకూరు నవంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని చింతవరం గ్రామ రెవిన్యూ విఆర్‌ఒగా గత 5 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కోటేశ్వరరావు(61) శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటి వద్దకు వెళ్లగా ఒక్కసారి కుప్పకూలి పోయాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు గూడూరు ప్రవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యలు తెలిపారు. బ్రహ్మచారిగా జీవనం సాగిస్తున్నాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు.

# అల్పపీడనంతో తీరప్రాంతం అప్రమత్తం

**- తడ జాలర్ల కుప్పాలలో జాగ్రత్తలు**
**- కంట్రోల్ రూమ్ ఏర్పాటు - తహశీల్దార్ రామయ్య వెల్లడి**

తడ, నవంబర్ 12 ప్రభాతవార్త



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారుతుందన్న వాతావరణ హెచ్చరికలతో తీరప్రాంతాన్ని అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తడ మండలంలోని జాలర్ల కుప్పాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తహశీల్దార్ రామయ్య శనివారం తెలి పారు. పులికాట్ సరస్సులో వేటకు వెళ్లిన జాలర్లను వెనక్కి మళ్లించే శామని చెప్పారు. ఆయా చోట్ల అత్యవసరంగా ఉపయోగించేందుకు చౌక బియ్యాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని డీలర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఇరకం, వేనాడు దీవులతో పాటు సరస్సు తీరంలోని సచివాలయాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. తడ తహశీల్దార్ కార్యాల యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సెలవు దినాల్లోనూ 24 గంటలూ పనిచేసేలా సిబ్బందిని నియమించామన్నారు. ఇదిలావుంటే శనివారం ఉదయం ఇక్కడ 44.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ముందస్తు జాగ్రత్తగా పోర్లుకట్టలు పరిశీలన

వాకాడు, నవంబర్ 12, ప్రభాతవార్త



తుఫాను ముందస్తు జాగ్రత్తగా మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలకు తుఫాను ఎదుర్కొనేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఎంపిడిఓ గోపినాధ్ అందించారు. శనివారం ఎంపిడిఓ గోపినాధ్, ఇన్చార్జ్ తహశీల్దార్ సారంగపాణి సిబ్బంది కలిసి కొండూరు పాలెంలోని తుఫాను సెంటర్‌ను సందర్శించి ఆ ప్రాంత మత్స్యకారులకు తగిన సలహాలు తెలిపారు. బాలురెడ్డి పాలెం స్వర్ణముఖి నదిపై కాజువే, గంగన్నపాలెం పొర్లు కట్టలను పరిశీలించారు. ఆ ప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని తెలిపారు. వాకాడులో ఉన్న స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లను కూడా వారు పరిశీలించారు.

## మినుము సాగులో రైతులు మెళకువలు పాటించాలి : ఎఓ

వెంకటగిరిరూరల్ నవంబర్ 12 ప్రభాతవార్త:

మండలంలో రైతులు సాగు చేస్తున్న మినుము సాగులో తగు మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుజాత తెలిపారు. అమె మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా కురిసి వర్షాలు మినుము పంట సాగుకు ఊరటనిచ్చిందని తెలియజేశారు. అదేవిధంగా మండలంలో రైతులు 250 హెక్టర్లలో మినుము సాగు చేస్తున్నారని, ప్రస్తుతం మినుము సాగులో మచ్చ తెగులు, లద్దెపురుగు, వైరస్ వ్యాపిస్తుందని, వ్యవసాయ శాఖ వారి సూచనలు మేరకు తగు మోతాదులో మందులు వాడితే తెగుళ్ళు పూర్తిగా తక్కు ముఖం పడుతాయని తెలిపారు. మచ్చ తెగులు నివారణకు డైకెన్ యం 45 ఎకరాకు అర కేజి, లద్దె పురుగు నివారణకు పురుగు దశను బట్టి క్లోరో 55, వైరస్ తెగులు నివారణకు అసిటామప్రెడ్ 70 గ్రాములు ఎకరాకు పిచాకారి చేస్తే తెగుళ్ళు తగ్గు తాయని తెలిపారు. అదేవిధంగా రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులతోపాటు ఫలసాయం నాణ్యతగా ఉంటుందని తెలియజేశారు.

## పంచాయతీకి 20 పనులకే అనుమతి

– పెండింగ్ పూర్తి చేస్తేనే కూలీలకు ఉపాధి

కోట, నవంబర్ 12 ప్రభాతవార్త



ఉపాధి హామీ పథకం పనులు వివరాలు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ చేసి మార్చిన కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలను కఠినతరం చేసింది. ఒక పంచాయతీలో ఒకే సమయంలో 20 పనులకు మించి అదనంగా మంజూరు చేయకుండా నిబంధనలు తెచ్చింది. గతంలో ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నవి కలిపి 20 దాటితే కొత్తవి మంజూరు చేయడానికి సాంకేతికంగా సాధ్యం కాదు. తిరుపతి జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ 20 కంటే ఎక్కువ పురోగతిలో ఉండటంతో కొత్తవి రావడం లేదు. దీంతో ఉపాధి హామీ యంత్రాంగం ప్రస్తుత పనులు పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. గతంలో చేపట్టిన మురుగు కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, మొక్కల పెంపకం, చెరువుల అభివృద్ధి తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. నిబంధనల మేరకే అవకాశం ఉన్న వాటిని రద్దు చేస్తున్నారు. గ్రామంలో కొత్తవి చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో కొత్త పనులు మస్టర్లు రానందున అక్కడ వారికి పని కల్పించలేని పరిస్థితి నెలకొందని ఉపాధి హామీ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రాధాన్యత భవనాలు మినహా ఇతర పనులు చేయలేకపోతున్నామని చెప్పారు. గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యతగా చేపట్టిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ గ్రంథాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దీంతో సాఫ్ట్‌వేర్ అనుమతించకపోవడంతో గ్రామాల్లో కూలీలకు పనులు దొరకడం లేదు. ఈ విషయంపై ఏపీఓ విజయమ్మను వివరణ కోరగా ఒక పంచాయతీలో 20 పనులకే అనుమతి ఉండటంతో మిగతా పనులు చేయలేకపోతున్నామని, ఈ విషయాన్ని పీడీ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

## కట్టమంచి బాలకృష్ణారెడ్డిని సన్మానించిన ద్రవిడ విసి రామకృష్ణ

చిత్తూరు, నవంబర్ 12 ప్రభాతవార్త



వైఎస్సార్ సాఫల్య అవార్డు పొందిన కట్ట మంచి బాలకృష్ణారెడ్డిని ద్రవిడ వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ ఘనం గా సత్కరించారు. చిత్తూరు మ్యాంగో భవన్ లో శనివారం జిల్లా రచయితల సంఘం అధ్వర్యంలో కట్టమంచి బాలకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈకార్య క్రమానికి హాజరైన ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ఒక్కో వ్యక్తికి ఒక్కో ప్రత్యేకత ఉంటుందన్నారు. వైఎస్సార్ సాఫల్య అవార్డు పొందిన కట్టమంచి బాలకృష్ణారెడ్డికి అనేక ప్రత్యేకలు ఉండడంతో ఆయనకు ప్రభుత్వం ఈ అవార్డు ప్రదానం చేసిందన్నారు. యూనివర్సిటీలో ఎంఎస్సీ దాకా చదువుకుని వ్యవసాయ రంగంలో ప్రవేశించిన కట్టమంచి రచయితగా, జర్నలిస్టుగా అనేక సేవలు సమాజం కోసం చేసి జిల్లాలో ఉద్యానవన పంటల్లో మామిడికి సంబంధించి పరిశోధనల కోసం రూపశిల్పిగా పేరు తెచ్చుకున్న కట్టమంచిని సత్కరించడం గర్వంగా ఉందన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ కట్టమంచి బాలకృష్ణారెడ్డి సంఘ సంస్కర్తగా కృషి చేశారన్నారు. అలాగే వ్యవసాయదారుడిగా ఉద్యానవన పంటల అభివృద్ధికి ఆయన కృషి చేశారన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున మామిడి గుజ్జు పరిశ్రమల ఏర్పాటుకోసం ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు కట్టమంచిని సత్కరించారు.

## ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం : డిపిటిఓ

తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 12 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలోని ఆర్టీసీ పరిధిలో ఉన్న బస్‌స్టేషన్లలో ఖాళీలున్న 96 దుకాణాలకు నిర్వాహకుల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ ప్రాంగణంలోని శ్రీహరి బస్‌స్టేషన్‌లో 14 దుకాణాలు, శ్రీనివాస బస్ స్టేషన్‌లో 10, ఏడుకొండల బస్‌స్టేషన్‌లో 2, ఎ.రంగంపేట బస్‌స్టేషన్‌లో 3, చంద్రగిరి, నేండ్రగుంట బస్‌స్టేషన్లలో ఒక్కొక్కటి చొప్పున, పాకాల బస్‌స్టేషన్‌లో 4, భాకరాపేటలో 2, పుత్తూరులో 3, శ్రీకాళహస్తిలో 6, సత్యవేడులో 4, నాగలాపురంలో 1, వాకాడులో 9, గూడూరులో 5, సూళ్లూరుపేట అలాగే నాయుడుపేటలో 15, వెంకటగిరి బస్‌స్టేషన్‌లో 6 దుకాణాలతో కలిపి 96 దుకాణాలకు అద్దె ప్రాతిపదికన నడుపుకోవడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు డిపిటిఓ చెంగల్‌రెడ్డి వివరించారు. ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ల దరఖాస్తులను బహిరంగపరుస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి స్పష్టంచేశారు.

# మా కుటుంబం ప్రజాసేవకే అంకితం - పవిత్రరెడ్డి

రేణిగుంట, నవంబరు 12 ప్రభాతవార్త: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబం ప్రజాసేవకే అంకితం అని రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి అన్నారు. శుక్రవారం రేణిగుంట పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండల వైకాపా ఇన్‌చార్జి బియ్యపు పవిత్రరెడ్డి ప్రారంభించారు. సీబీఐడీ కాలనీ వాసులు దారి లేకుండా పడుతున్న కష్టాలను పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, స్థానిక సర్పంచ్ నాగేషం, యువజన నేతలు అంకిమణి, కిరణ్, సంకేష్‌యాదవ్ తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడంతో తక్షణం స్పందించి ఆయన సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. బాలుర ఉన్నత



పాఠశాలలో అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంలో భాగంగా వే ఫౌండేషన్ ఏర్పాటు చేసిన మౌలానా అబుల్‌కలాం విగ్రహాన్ని పవిత్రరెడ్డి ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. గురువారం అస్వస్థతకు గురై మృతి చెందిన 8 సంవత్సరాల చిన్నారి కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు మధుసూదన్‌రెడ్డి కుమారుడు ఆకర్షరెడ్డి చిన్నారి కుటుంబానికి రూ.పది వేలు ఆర్థిక సాయం చేశారు. దాదాపు 300 మంది దళితులు నీటి కొళాయిల కోసం ఇబ్బంది పడడాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడంతో వెంటనే వారికి ఉచితంగా కొళాయి కలెక్షన్లు ఇవ్వాలని ఇచ్చిన ప్రొసిడింగ్ కాగితాలను బియ్యపు పవిత్రరెడ్డి రేణిగుంట సచివాలయంలో దళితులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, రేణిగుంట సర్పంచ్ నాగేషం, పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్ రాజా, మండలవైకాపామైనారిటీఅధ్యక్షుడుఅబ్దుల్‌ఖాదర్, పాల్గొన్నారు.

## స్వర్ణమ్మ హారతులకు నదిలో చేరుతున్న వరదనీరు

శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త



ఉత్తరవాహినిగా, జీవనదిగా సాగుతున్న స్వర్ణముఖి నదికి గత వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పాయగా నీరు వస్తుంది. గత ఏడాది రెండు సార్లు నదికి నవంబర్‌మాసంలో వరద వచ్చింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జీవనదిలో నీరు పొంగుతుంది. అంటే నదికి వరద వస్తుంది. కార్తీక మాసంలో ఈ నెల 22న మాస శివరాత్రి సందర్భంగా 'స్వర్ణమ్మకు దీపాల హారతి ఇవ్వటానికి' భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం క్రితం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పట్టుబట్టి నదిలోని పిచ్చిమొక్కలను తొలగించారు. మూడు రోజులుగా నదిలో నీరు పొంగటంతో అయ్యప్పభక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వేకువజామున స్నానమాచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. అంతేకాక దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వర్ణముఖి నదిలోస్నానమాచరించిదర్శనం చేసుకుంటారు. నదికి వరద నీరు చేరుతుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీరామ్‌నగర్ కాలనీ సోయగం చూడతరమా?

రోడ్లు తవ్వేసి: బురదమయం చేసి..

శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని శ్రీరామనగర్ కాలనీ మొదటి లే అవుట్ కాలనీ. అయితే ఇది సంపన్నుల కాలనీ కావటంతో ఇక్కడ మున్సిపల్ జనరల్ ఫండ్స్ కేటాయించటం సాధ్యం కాలేదు. అయితే ప్రస్తుత పాలనలో ఇక్కడ అభివృద్ధికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పెద్ద పీట వేసారు. కాలువలు నిర్మించారు. అయితే చక్కటి సిమెంటు రోడ్లు వేసారు. అయితే మళ్ళీ పైప్‌లైన్ల ఏర్పాటు సాకుతో రోడ్లను తవ్వేసారు. దాంతో ఇక్కడి ప్రజలకు శాపంగా మారింది. విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక్కడ అధికారులతో పాటు పలు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఒక పాఠశాలలో అయితే సుమారు వేయి మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పైప్‌లైన్ల ఏర్పాటుకు రోడ్లు తవ్వేయటంతో వర్షాలతో బురదమయం అయ్యింది. కాలు తీసి కాలు పెట్టడానికి ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కనీసం గతుకులు పూడ్చాలని కోరుతున్నారు.

## లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుకు అప్పీలు లేదు

-సీనియర్ సివిల్‌జడ్జి



శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త

లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పుకు అప్పీలు లేదని ఇక్కడ ఇచ్చిన తీర్పే అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో సమానం అని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబిరాణి మరియు అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్రులు అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవడానికి సహకరిస్తూ లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి చేయాలని, రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకుని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అన్నిశాఖ అధికారులు దోహదపడాలని సూచించారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి నరేంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసుల్లో కక్షిదారులను ఒప్పించి అధిక సంఖ్యలోపూర్తి చేయాలని తెలిపారు. ఎన్ఐ యాక్టు కేసుల్లో సుమారు 2లక్షల విలువచేసే చెక్కు ఎన్ఐ యాక్టు కేసు యుఎస్/138, బ్యాంకు రికవరీకేసు, మ్యాట్రిమోనీ కేసు, కార్మికుల సమస్యలను, భూవివాదాతలు, సివిల్‌కేసులు, రెవెన్యూ, కాంపౌండ్ ఎక్సైజ్ కేసు, ప్రిలిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు లోక్‌అదాలత్‌లు ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో ఉచిత వైద్యశిబిరం, ఐసిడిఎస్ శాఖ ద్వారా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు అందించి పౌష్టికాహారం మరియు వారి మేధస్సును పెంపొందించే విధంగా ఉపయోగపడే బొమ్మలను ప్రదర్శించారు. మరియు మహిళ పోలీస్ దిశచట్టం, సైబర్ క్రైం గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో మొత్తం 444కేసులు పరిష్కరించగా రూ.33,55,619లక్షలు నగదు రికవరీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, అన్నిశాఖల అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓబిసి మోర్చా విభాగ రాష్ట్ర కన్వీనర్‌గా చంద్రప్ప




శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీ ఓబిసి మోర్చా రీసెర్చ్ మరియు పాలసీ విభాగానికి రాష్ట్ర కన్వీనర్‌గా పట్టణానికి చెందిన బిజెపి నాయకులు డాక్టర్ చంద్రప్పను నియమిస్తూ ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగలగోపి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ, గోపిశ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. న్యూఢిల్లీలో ఈనెల 14,15 తేదీల్లో జరిగే పార్టీ జాతీయ కార్యాలయంలో జరగనున్న ఓబిసి మోర్చా రీసెర్చ్ మరియు పాలసీ విభాగానికి సంబందించిన సమావేశంలో పాల్గొనడానికి వెళ్ళనున్నారు. ఈసందర్భంగా పలువురు చంద్రప్పను అభినందించారు.

## ప్రత్యేక హోదా ఊసే లేదు

పోలవరం మాటే లేదు, :ప్రధాని విశాఖ పర్యటపై నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి, నవంబర్ 12ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడీ మరోసారి రాష్ట్రప్రజలను నమ్మించి మోసం చేశారని, రెండురోజుల విశాఖపట్నం పర్యటనలో రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమీ లేదని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్‌రెడ్డి ఎద్దేవాచేశారు. ప్రధానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రానికి రావలసిన ప్రయోజనాలపై గట్టిగా ప్రశ్నించలేకపోయారని, ఆయన ప్రసంగం తెలుగులో చేయడంతో అరణ్యరోదనగా మారిందన్నారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతూన్నరని, ప్రత్యేక హోదా ఊసే ప్రధాని శనివారం ఎత్తలేదని, పోలవరం గురించి మాటకైనా హామీ ఇవ్వలేకపోవడం ముఖ్యమంత్రి ఒత్తిడి చేయకపోవడమే కారణమన్నారు.

## అన్ని వ్యాధులకు మూలం డయాబెటిస్

రేణిగుంట, నవంబరు 12 ప్రభాతవార్త: అన్ని వ్యాధులకు మూలం డయాబెటిస్ అని అమర వైద్యులు అన్నారు. డయాబెటిస్‌పై అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మాదిరి ఈ సంవత్సరం కూడా నవంబరు 14వ తేదీ డయాబెటిక్ దినంగా రేణిగుంట మండలం కరకంబాడి అమర ఆస్పత్రి నిర్వహిస్తుంది. అందులో భాగంగా 14 రోజులు పాటు నవంబరు 14 నుంచి 30 తేదీ వరకు అతి తక్కువ ప్యాకేజీతో డయాబెటిక్ సంబంధించిన అన్ని పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కేవలం 499 రూపాయలకే ఎంతో ఖరీదైన పరీక్షలను డాక్టర్ కన్సల్టింగ్‌తో పాటు నిర్వహిస్తామని అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, గౌరినేని, డా. వరుణ్, హర్షితరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలియజేశారు.

## భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, నవంబరు 12 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలాగే ఆలయంలో పరివార దేవతలైన సూర్య భగవానుడు సుబ్రహ్మణ్యస్వామికి కూడా అభిషేకాలు అలంకరణలు చేశారు. సాయంత్రం కలస స్థాపన విఘ్నేశ్వర పూజ గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## కమనీయంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం

వడమాలపేట, నవంబరు 12 ప్రభాతవార్త:



స్థానిక భవానీశంకర్ దేవాలయంలో నవ వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం శివనామ స్మరణలతో కమనీయంగా జరిగింది. ఉదయం మహాశివుడికి విశేష ద్రవ్యాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశివుడిని ప్రత్యేకంగా అలంక రించి పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో నూతన వధువరులుగా అలంకరింపచేశారు. అర్చకులు శివ, సాయిల ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగళ్యధారణ చేయించారు. అనంతరం నూతన వధువరులచే తళంబ్రాలు పోయించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## గుంతలమయమైన రోడ్లు

ప్రమాదపుటంచుల్లో ప్రయాణికులు

రామచంద్రాపురం, నవంబర్ 12 ప్రభాతవార్త:



తేలికపాటి వర్షాలకే గుంటలమయమైన రోడ్లపై వాహనచోదకులు ప్రమాదపుటంచుల్లో తమ ప్రయాణం సాగిస్తున్నారు. తిరుపతి-అనుప్పల్లి, తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారులు గుంతలమయమయ్యాయి. తేలికపాటి వర్షానికి గుంతలలో వర్షపు నీరు చేరడంతో వాహన చోదకులు రోడ్డుపై ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొన్నట్లు వాపోతున్నారు. దీంతో ప్రాణాలు అరచేతిలోపెట్టుకుని ప్రయాణించాల్సి వస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలలో దిగిన ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పల్టీకొడుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనచోదకులు గుంతలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు ప్రధాన మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులను వెంటనే మరమత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాస్వామ్యంలో సత్యమే గెలిచింది

-మంత్రి రోజాపై అధికార దుర్వినియోగ కేసు వేస్తాం

జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్



తిరుపతి ప్రెస్‌క్లబ్, నవంబర్ 12 ప్రభాతవార్త: వ్యక్తిగత కక్షలతో జిల్లా మంత్రి రోజా తనను అక్రమ పద్ధతిలో అరెస్ట్ చేయించి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినా చివరికి సత్యం, న్యాయమే గెలిచాయని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ స్పష్టంచేశారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత, జనసేనాని పవన్‌కళ్యాణ్‌పై రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి రోజా నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేయడం తమ జనసైనికులను బాధించిందని అన్నారు. ఇందులో భాగంగానే తాను ప్రతిస్పందించానని, అది జీర్ణించుకోలేక ఆమె తనపై తప్పుడు కేసులు పెట్టి తనను అరెస్ట్ చేయించడం జరిగిందని అన్నారు. వైసిపి పాలనలో గత మూడేళ్లుగా ప్రజాస్వామ్యం ఖూనీ గావించబడుతోందని, వీరి ప్రజా వ్యతిరేక విధానాలను ఎవరు ప్రశ్నించినా వారిని ఇలా అక్రమంగా అరెస్ట్ చేయించడం రివాజుగా మారిందని మండిపడ్డారు. అనంతరం జనసేన జిల్లా ఇన్‌ఛార్జ్ డా॥పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ తమ జనసేనాని పవన్ నీతి, నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తుంటే వైసిపి నేతల్లో భయం పుట్టుకుందని, దానికి నిదర్శనమే కిరణ్‌రాయల్ అరెస్ట్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు రాజారెడ్డి, బత్తిన మధుబాబు, ఆకేపాటి సుభాషిణి, కోట వినుత, వనజమ్మ, బాబ్జి, హేమంత్, సుమన్‌రాయల్, మునస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## త్రినయని ఎపిసోడ్స్‌కీలక సన్నివేశాలు

తిరుపతి, నవంబర్ 12ప్రభాతవార్త: జీతెలుగు టివి సీరియల్ త్రినయనిలో తన గురించి కీలకమైన నిజాన్ని తెలుసుకున్ననయని ఎపిసోడ్స్‌లో ట్విస్ట్‌లు, కథని మలుపుతిప్పే కీలక సన్నివేశాలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేయనున్నాయి. అత్యధికంగా ప్రేక్షకులు త్రినయని సీరియల్‌ను ఆదరిస్తున్నారని సంబంధిత ప్రతినిధి పేర్కొన్నారు. ఈనెల 14నుంచి ప్రసారంకానున్న ఇందులో అత్యంత విలువైన నాగమణిని తిరిగి పొందేందుకు నయని తన ప్రయత్నాలను ప్రారంభించడం, నాగమణి అదృశ్యం వెనుక ప్రయత్నాలు మొదలుపెట్టడం వంటివి ఉంటాయన్నారు.

# తిరుపతి డివిజన్

## గంగుడుపల్లిలో రైతు ఆత్మహత్య

చంద్రగిరి, నవంబర్ 12 ప్రభాతవార్త:



మండల పరిధిలోని గంగుడుపల్లిలో మానసిక వేదనకు గురైన ఓ రైతు శనివారం ఆత్మహత్యకు పాల్పడి మరణించాడు. పోలీసుల కథనం మేరకు.. గంగుడుపల్లికి చెందిన కామసాని మునిరెడ్డి (65) మానసిక వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన ఇప్పటికే మూడు పర్యాయాలు విషపూరితమైన వడిశాకు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే సకాలంలో గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి కాపాడుకున్నారు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురుకుమారులు వున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిత్యాన్న ప్రసాదానికి విరాళం

శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ నేపథ్యంలో విరాళాలు భారీగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం నిత్యాన్న పథకానికి తొట్టంబేడు మండలం ఈదులగుంటకు చెందిన పోటుకుంచి శ్రీరామకృష్ణ మూర్తి-కిరణ్మయి కుటుంబం శనివారం విరాళం అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలు చేస్తున్న నిత్యాన్న పథకానికి భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందని గుర్తించిన వారు విరాళం ఇవ్వాలని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు వివరించారు. ఈ నేపథ్యంలో వారు రూ.50వేలు విరాళాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా రూ.50వేలు విరాళాన్ని అందజేసారు. వారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎసి మల్లికార్జున్ ప్రసాద్, మున్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ కార్యాలయం రోడ్డు గుంతలమయం

తొట్టంబేడు, నవంబర్ 12 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులో ఉన్న 132/32 కెవి సబ్‌స్టేషన్ ఏపి ట్రాన్స్‌కో కార్యాలయం లోకి వెళ్లాలంటే ఇబ్బందు లుతప్పడంలేదు. వర్షాలకు కార్యాలయానికి వెళ్ళి బిల్లుకట్టాలన్నా బురదమయంగా మారి గుంతలుగా తయారైంది. అంతేకాకుండా ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికూడా పెద్ద పెద్ద గుంతలతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఈమార్గంలో క్రషర్‌మట్టిని అయినా వేయాలని ఉన్నతాధికారులకు ఎప్పుడూ అనిపించలేదో ఏమో మరి ఇలాగే వదిలేసి గతుకులమయంగా మారిన రోడ్డులోనే వెళ్తున్నారు. ఇక రాత్రివేళల్లో విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్‌లైట్లు ఉండవు. ఇక సెక్యూరిటీ కూడా లేదు. ఈ ప్రాంగణంలోనే పట్టణ, రూరల్ డిఈఈ కార్యాలయం, తొట్టంబేడు విద్యుత్ ఎఈఈ కార్యాలయాలు, సిబ్బంది విధులు నిర్వహించే కార్యాలయాలు ఉన్నాయి. తొట్టంబేడు విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదురుగా ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. వీటికి రక్షణ కూడా లేదు. కనీసం విద్యుత్ అధికారులు కార్యాలయ ప్రాంగణంలో అయినా ఒక్క లైటు కూడా వేయకపోవడం శోచనీయం. రాత్రివేళల్లో కార్యాలయ ప్రాంగణం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డును బాగుచేయడంతోపాటు కార్యాలయ ప్రాంగణంలో లైట్లువేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కపిలేశ్వర ఆలయంలో రుద్రహోమం ఆరంభం

తిరుపతి, నవంబర్ 12ప్రభాతవార్త:



పవిత్ర కార్తీకమాసవిశేషపూజల్లో కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం రుద్రహోమం మొదలైంది. శాస్త్రోక్తంగా ఆలయంలో అర్చకులు హోమం నిర్వహించారు. 11రోజులపాటు ఈ హోమం అర్చకులు వేదమంత్రాలతో జరిపిస్తారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరస్వామి ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, ఎఇఓ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## తిరుపతి అర్ట్‌సొసైటీ

రాష్ట్రస్థాయి చిత్రకళా శిబిరం ప్రారంభం



తిరుపతి, నవంబర్ 12ప్రభాతవార్త: తిరుపతి అర్ట్‌సొసైటీ ఆధ్వర్యంలో బాలాజీకా లనీలోని రాళ్ళపల్లి అతిధిగృహంలో శనివారం రాష్ట్రస్థాయి పెయింటింగ్ వర్క్‌షాప్ ప్రారంభ మైంది, డాక్టర్ బి.సుకుమార్ ఈ సదస్సును జ్యోతివెలిగించి ప్రారంభించారు. చిత్రకళద్వారా ప్రస్తుత పరిస్థితులను, భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఆర్ట్‌రూపంలో తెలియజేయడానికి కళాకారులకు రెండు రోజుల వర్కుషాపు దోహదపడుతుందని డాక్టర్‌సుకుమార్ తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 20మంది చిత్రకళాకారులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నాగవేటి హేమాక్షి ఆచారి, కార్యదర్శి ఈశలాపురం బాలసుబ్రమణ్యం, బాలల సంక్షేమశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.స్వాతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ హేమంతబాబు పాల్గొన్నారు. నేటి సాయంత్రం ముగింపు కార్యక్రమం జరుగుతుంది.

## అధిష్టానం ఆదేశం శిరోధార్యం

- వడమాలపేట జడ్పీటీసీ

రేణిగుంట, నవంబరు 12 ప్రభాతవార్త:




రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలను శిరోధార్యంగా భావిస్తానని వడమాలపేట జడ్పీ టీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. పార్టీలోని అంతర్గత విబేధాల వల్ల వడమాలపేట మండలం పత్తిపు త్తూరులో మంత్రి ప్రారంభించ బో తున్న నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తారని శనివారం వడమా లపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డిని పోలీసులు అదుపులో తీసుకుని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి బేషరతుగా విడుదల చేశారు. ఆయనను అదుపులోకి తీసుకున్న విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. విడుదలైన తరువాత ఆయనకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం మురళీధర్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ అరెస్టును ఖండించారు. తనపై కావాలని మంత్రి కక్ష కట్టారన్నారు. ప్రారంభోత్సవం కావలసిన పత్తి పుత్తి పుత్తూరులోని భవనాలు పాడు కాకుండా తాళాలు వేశాను తప్ప వేరే ఉద్దేశం లేదన్నారు. సచివాలయ ప్రారంభోత్సవానికి జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను ఆహ్వానించాలనుకున్నానన్నారు. ఇంతలో తమ అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు.

## శివయ్య సన్నిధిలో ఐడిఈఎస్ డైరెక్టర్



శ్రీకాళహస్తి, నవంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం ఐడిఈఎస్ డైరెక్టర్ అజయ్‌కుమార్ శర్మ కుటుంబసభ్యులతో విచ్చేశారు. వీరికి స్థానిక శాసనసభ్యుడు బియ్యపుమధుసూధన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డి విచ్చేసి స్వాగతం పలికారు. ఆలయంలో స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి వేదపండితుల ఆశీర్వదించారు.

# పౌష్టికాహార లోపాన్ని అధిగమిద్దాం

## న్యూమోనియాను నిలువరిద్దాం..! ఎస్వీఎంసి సామాజిక వైద్యశాస్త్రస విభాగాధిపతి డాక్టర్ రవిప్రభు

చంద్రగిరి, నవంబర్ 12 ప్రభాతవార్త: 5 ఏళ్ళ లోపు చిన్నారులు, 60 ఏళ్ళు పైబడిన వృద్దులలో పౌష్టికాహారలోపాన్ని అధిగమించాలని శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాల సామాజిక వైద్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రవిప్రభు అన్నారు. స్థానిక గ్రామీణ ఆరోగ్య పరిశోధనా కేంద్రంలో శనివారం ఎస్వీఎంసి, చంద్రగిరి ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ న్యూమోనియా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం, సకాలంలో టీకాలు వేయడం, వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు, వ్యాధినిరోధక శక్తి పెంపొందింపజేయడం వంటి చర్యలతో న్యూమోనియా వ్యాధిని నిలువరించాలన్నారు. డాక్టర్ రామాంజనేయులు ఏటా నవంబర్ 12న ప్రపంచ న్యూమోనియా



దినోత్సవం సందర్భంగా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 15.5 కోట్ల మంది ఈ వ్యాధిబారినపడుతున్నట్లు తెలిపారు. ఇందులో దాదాపు 16 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం 5 ఏళ్ళ చిన్నారులకు, 60 ఏళ్ళు పైబడిన వృద్దులకు (షుగర్, క్షయ, గుండె జబ్బులు) సకాలం చేరవేయగలిగితే కనీసం 10 లక్షల మందిని కాపాడుకోగలమన్నారు. పిల్లలకు తల్లి (ముర్రిపాలు) పాలు శ్రేష్టమైనవన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షాఫీర్ ఖాన్, డాక్టర్ సునీత, డాక్టర్ శశికళ, ఆర్‌హెచ్‌టిసి వైద్య సిబ్బంది, పి.జి.లు, హౌస్ సర్జన్లు, ఆర్‌ఎచ్‌టిసి సూపర్‌వైజర్ మురళి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్స్, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యు సిబ్బంది, పాల్గొన్నారు.

# భక్తులతో పోటెత్తిన కాణిపాకం -కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



కాణిపాకం, నవంబర్ 12 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి అలయం శనివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఆలయంలో సాధారణంగా వారాంతపు రోజులు శని, ఆదివారాల్లో తీవ్ర స్థాయిలో భక్తుల రద్దీ వుంటుంది. ఈమేరకు పవిత్ర కార్తీకమాసం, శనివారం సంకట హర చతుర్థితో పాటు శని,ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాలనుండి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల నుండి కూడా భక్తులు స్వామివారికి మొక్కుబడులు తీర్చుకు నేందుకు కాణిపాకం ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దీనితో ఉదయం నుండి రాత్రి వరకు భక్తజన సందోహంతో కాణిపాకం ఆలయం కిక్కిరిసింది. ఆలయం లోపుల క్యూలైన్లు, సర్వదర్శనం కంపార్ట్‌మెంట్ పూర్తిగా నిండిపోవడంతో బయట క్యూలైన్లలో వేచివుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ కారణంగా స్వామి దర్శనంకోసం సుమారు మూడు నుండి నాలుగు గంటల పాటు క్యూలైన్లలో భక్తులు వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే భక్తులు వచ్చిన వాహనాలతో ఆలయ పరిసరాలన్ని నిండిపోయాయి. ఆలయ పరిసరాలన్ని నిండిపోవడంతో భక్తులు తమ వాహనాలను బహుదానది వద్ద కూడా పార్కింగ్ చేయాల్సి వచ్చింది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## గణనాధుని సేవలో హైకోర్టు జడ్జి



రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యాం సుందర్ కుటుంబ సమేతంగా శనివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి,చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఐరాల తహశీల్దార్ సుశీల, స్థానిక ఎస్సై మనోహర్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిందే!



సూళ్లూరుపేట, నవంబర్ 12 ప్రభాతవార్త : ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వ అధికారులు తమ కార్యాలయాలకు వెళ్లాలంటే అడుసు తొక్కాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. సూళ్లూరుపేటలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉన్న ప్రాంతంలో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డుపై నీరు నిలిచిపోయి కార్యాలయాలకు వెళ్లే అధికారులతో పాటు ప్రజలు మురుగునీటిలో కార్యాల యాలకు వెళ్లి పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. తహశీల్దార్ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ వ్యవసాయశాఖ, గృహ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో కార్యాలయాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు ఉన్నప్పటికీ రోడ్డుపై వర్షపునీరు పడితే అది వెళ్లే మార్గం లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారుతోంది. పక్కనే శిథిలావస్థలో మూతబడి ఉన్న హాస్టల్ దగ్గరగా డ్రైనేజి ఉన్నప్పటికీ అందులోకి ఈ వర్షపు నీరు వెళ్లే ఏర్పాటు చేసి డ్రైనేజి నిర్మిస్తే కొంతవరకు ఈ అడుగు నీళ్ల నుంచి ప్రజలకు, అధికారులకు విముక్తి లభించే అవకాశముంది.

## మద్యం మత్తులో హత్య!

రేణిగుంట, నవంబరు 12 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామా నగర్‌లో మద్యం మత్తులో జరిగిన గొడవ కారణంగా ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అయితే విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు తిరుపతికి చెందిన జానకిరామ్ అలియాస్ జానీ(25), తారకరామానగర్‌కు చెందిన శ్రీనివాసులు (18) పెయింటింగ్ పనులకు వెళ్లారు. వీరు శుక్రవారం పెయింటింగ్ పనులకు వెళ్లారు. శ్రీనివాసులకు డబ్బులు రావడంతో మధ్యాహ్నం తారకరామానగర్‌లో మద్యం సేవించారు. మద్యం మత్తులో వీరి మధ్య చిన్న గొడవ మొదలైంది. ఇది చిలికి చిలికి గాలివానగా మారి తీవ్ర స్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో జానకిరామ్ పక్కనే ఉన్న ఇంట్లో కత్తి తీసుకుని శ్రీనివాసులపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాసులు గాయపడగా అతనిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతను మరణించాడు. విషయం తెలుసుకున్న రేణిగుంట సీఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## ఎం.ఎస్.సి నర్సింగ్ కోర్సుకు ప్రవేశం

తిరుపతినగరం, నవంబర్ 12 ప్రభాతవార్త: స్విమ్స్ యూనివర్శిటీ నందు 2022-23వ విద్యా సంవత్సరానికి ఎం.ఎస్.సి నర్సింగ్ కోర్సు నందు ప్రవేశం కొరకు దరఖాస్తులను కోరుతున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్ బాబు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు అకడమిక్ విభాగంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

## ముక్కోటి అగస్త్యేశ్వరస్వామి వారి పూలంగిసేవ



చంద్రగిరి, నవంబర్ 12 ప్రభాతవార్త: స్వర్ణముఖీనదీ తీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ముక్కోటి ఉత్సవాలలో శనివారం పూలంగిసేవ కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ముక్కోటి ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం స్వామి ఉదయం ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి అభిషేకం, విశేష అలంకరణ, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఉదయం 8 గంటలకు శ్రీవినాయకస్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. 9 గంటలకు శ్రీకృష్ణ, శ్రీరామ చంద్రస్వామి వార్లకు అభిషేకం జరిపించారు. 10.30 గంటలకు శ్రీఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను విశేష అలంకరణతో పూలంగిసేవ కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అధికారిక వాహనమైన నంది వాహనంపై అధిష్టించి ఆలయ మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

## ఇండియన్ అకాడమీ ఆఫ్ ట్రాపికల్ పారాసైటాలజీ కాన్ఫరెన్స్ విజయవంతం



తిరుపతినగరం, నవంబర్ 12 ప్రభాతవార్త: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల నందు ఐ.ఎ.టి.పి. ఎ.పి.అండ్ టి.ఎస్ చాప్టర్ కాన్ఫరెన్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ సూరిన్‌టెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు, ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, విసి శ్రీ బాలాజీ విద్యాపీఠ్, పాండిచ్చేరి, డాక్టర్ ఎస్.సి.పారిజ, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీధర్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ శరణ్ బి సింగ్, డాక్టర్ అభిజిత్ చౌదరి, డాక్టర్ నాగరాజులు సంయుక్తంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం టెక్స్ బుక్ ఆఫ్ పారాసైటిక్ జూనోసిస్ అనే పుస్తకాన్ని ఉపకులపతి బి.వెంగమ్మ మరియు అతిథులు ఆవిష్కరించారు.

## శివయ్య సేవలో ఆకాశ దీపం



శ్రీకాళహస్తి,నవంబర్ 12 ప్రభాతవార్త : శనివారం సాయంత్రం ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని సన్నిధిలో వేడుకకుంటూ కార్తీక మాసంలో నిర్వహించే ఆకాశ దీపాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఆలయంలోని కోట మండపం వద్ద కార్తీక మాసంలో ఆకాశ దీపాన్ని ఆవిష్కరించటం, ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు పాల్గొనటం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శనివారం ఆకాశ దీపాన్ని ఎసి ఆవిష్కరింపజేసారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ పౌరోహితులు అర్ధగిరి వేదమంత్రాలు పఠిస్తుండగా శాస్త్రోక్తంగా ఆవిష్కరింపజేయారు.ఆలయ ఇన్స్‌పెక్టర్ సురేష్‌రెడ్డి,దఫేదార్ దాము, వేదపండితులు బోర్డు సభ్యులు,ప్రత్యేకాహ్వానితులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

**అభిషేకాలకు పెరుగుతున్న భక్తులు**

**-వెదు వేలు దాటిన రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 1916 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్టులో 2199 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 2679 మంది, రూ.750టిక్కెట్లతో 1247, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 407 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 291 మంది, రూ.5వేల టిక్కెట్లు 78 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. కాగా అభిషేకాలు 103 శనీశ్వరాభిషేకాలు,మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 51 శనీశ్వరాభిషేకాలు 61,నిత్యకళ్యాణ సేవల్లో 4 జరిగినట్లు సమాచారం అందించారు. భక్తులు పెరుగుతున్న దృష్ట్యా ఆలయాధికారులు కొన్ని సంస్కరణలు చేపట్టారు. లఘు దర్శనం ఖరారుచేసారు.ఇక వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయంలో అంతరాలయం ప్రవేశం విఐపిలకే పరిమితం చేసారు.కానీ అభిషేకాలకు అసలే ఆలయంలో పట్టనంత మందిని అనుమతిస్తుంటే అడ్డదారులు,పలుకుబడి దర్శనాల బెడద ఎక్కువౌతుంది.

## సంకల్ప వరసిద్దివినాయకునికి ప్రత్యేక అభిషేకం

తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్త: వినాయకసాగర్‌లోని సంకల్పవరసిద్ది వినాయక ఆలయంలో శనివారం సంకటహరచతుర్థశి పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. సాయంత్రం రాయలసీమరంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. వరసిద్దివినాయకుని ఆశీస్సులతో ప్రజలకు శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు,భక్తులు విజయకుమార్‌రెడ్డి, ప్రవచనకర్త గరికపాటి రమేష్‌బాబు, సుబ్రమ్యాంరెడ్డి, బ్రాహ్మణ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జయలక్ష్మి,బాగా శ్రీనివాసులు, సాయి పాల్గొన్నారు.

## జిల్లాలో భారీగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా పట్టివేత



తిరుపతి,నవంబర్ 12ప్రభాతవార్త: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు సరఫరా చేస్తున్న రేషన్‌బియ్యాన్ని బస్తాలుగా అక్రమమార్గంలో తరలిస్తున్న నిందితులపై తిరుపతిజిల్లాలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ముమ్మరంగా దాడులు కొనసాగిస్తున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అదనపు ఎస్పీ కె.ఈశ్వర్‌రెడ్డికి అందిన సమాచారంతో శనివారం ఉదయం ఆ విభాగం సిఐ కె.వెంకటరవి, సిబ్బంది మురళి, సత్యరాజ్, సివిల్‌సప్లయిస్ అధికారులు సిఎస్‌డిటి మాధవి, విఆర్‌ఓ చెంచుకృష్ణ సూళ్ళూరుపేట-నాయుడుపేట హైవేపై వాహనాల తనిఖీ చేశారు. ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 183 బస్తాలలో సుమారు 9,200కిలోల రేషన్‌బియ్యాన్ని పట్టుకు న్నారు. లారీ డ్రైవర్ శ్రీకాళహస్తి తొట్టంబేడుకు చెందిన పి.విజయ్‌ను అరెస్టుచేశారు.ఈ భారీమొత్తంలో రేషన్‌బియ్యం అమాసమనీ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన రేషన్‌బియ్యం విలువ సుమారు 3,40,400 రూపాయలు ఉంటుందని అదనపు ఎస్పీ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. లారీ విలువ12లక్షలు ఉంటుందన్నారు. తిరుపతి,చిత్తూరు జిల్లాలో పేదలకు అందాల్సిన రేషన్‌బియ్యం అక్రమరవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## వేడుకుందామా...వేంకటపతి

**ఊంజల్‌సేవలో శోభారాజు కీర్తనలు**



తిరుమల,నవంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠం ఏడుకొండల్లో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ శనివారం సాయంత్రం నాదనీరాజనం వేదిక పక్కన ఊంజల్‌సేవలో ప్రముఖ గాయని శోభారాజు అన్నమయ్యకీర్తనలు ఆలపించారు. ప్రతనెలా రెండవశనివారం ఆమె తన బృందంతో కలసి తిరుమలకు చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిపై కీర్తనలుతో మంత్రముగ్ధుల్ని చేస్తారు. కీర్తనలు అనంతరం టిటిడి ఆలయ అధికారులు శోభారాజును సత్కరించారు. స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కీబోర్డుపై కల్యాణి, తబల మంజు, గాత్రం క్రాంతి, మురళి సహకారం అందించారు.

## న్యుమోనియా వ్యాధి నివారణపై అవగాహన



తిరుపతినగరం, నవంబర్ 12 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో న్యుమోనియా వ్యాధి నివారణ చర్యలపై సామాజిక అవగాహనా క్యాక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖా ధికారి డాక్టర్ యు.శ్రీహరి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు న్యుమోనియా వ్యాధి బారినపడి చాలామంది చనిపోతురన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి దగ్గు, జలుబు ఎక్కువగా ఉండడం, ఎక్కువసార్లు వేగంగా శ్వాస తీసుకోవడం అధిక జ్వరం, డొక్కలు ఎగుర వేయడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు, ఇలా వున్నపుడు సమీపంలోని ఆరోగ్య వైద్యశాలకు తీసుకెళ్ళాలని,ఈనెల 12వ తేదీ నుండి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలు ఇంటింటా సర్వే నిర్వహించి వారిని గుర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ వికాస్, సూళ్ళూరుపేట డివిజన్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డుకు మహర్దశ

**- బెల్లం, మామిడి ఎగుమతికి ప్రోత్సాహం - చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



చిత్తూరురూరల్, నవంబరు 12 ప్రభాతవార్త: బెల్లం, మామిడి విక్రయాలకు ప్రసిద్ది చెందిన చిత్తూరు మార్కెట్ యార్డును ఆధునాతనంగా తీర్చిదిద్దనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మార్కెట్ యార్డు ప్రాంగణంలో చిత్తూరు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంను కమిటీ ఛైర్మెన్ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా చేపట్టారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, వ్యాపారస్తులకు సదుపాయాలను కల్పించి మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచనున్నట్లు తెలిపారు. నగరంలోని మార్కెట్ యార్డు, బెల్లం మండిల కోసం మంగసముద్రం యార్డులలో అన్ని రకాల సదుపాయాలను కల్పించనున్నట్లు, కేంద్ర ప్రభుత్వ నిధులు వందకోట్లతో యార్డుల ఆధునీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే కొత్తకమిటీని అభినందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆముద, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఇందుమతి, కమిటీసభ్యులు రామూర్తి, వరలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డివారిపల్లెలో చోరీ : బంగారు నగలు అపహరణ



ఐరాల, నవంబర్ 12 ప్రభాతవార్త: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి వుంచిన బంగారు నగలును దోచుకెళ్ళిన సంఘటన మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో శనివారం ఉదయం జరిగింది. సంఘటనకు సంభందించి స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు రెడ్డి దంపతులు వ్యక్తిగత పనిమీద ఐరాలకు వెళ్ళిన సమయంలో సుమారు 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టి అందులో దిచి వుంచిన సుమారు 100 గ్రాముల బంగారు నగలును దోచుకెళ్ళారు. ఇంటికి తిరిగి వచ్చిన శ్రీనివాసులురెడ్డి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు చిత్తూరు నుండి క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలను, ఆధారాలను సేకరించారు. ఈమేరకు ఏసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## స్విమ్స్‌లో క్యాన్సర్ ఓ.పి వైద్య సేవలు విస్తృతం

తిరుపతినగరం, నవంబర్ 12 ప్రభాతవార్త: రోజు రోజుకు పెరుగుతున్న క్యాన్సర్ రోగుల సౌకర్యార్థం సర్జికల్ మరియు రేడియేషన్ అంకాలజీ (క్యాన్సర్) ఓ.పి వైద్య సేవలు విస్తృత పరచటం జరిగిందని, ఈ సేవలు ఈనెల 14వ తేదీ సోమవారం నుండి అందుబాటు వుంటాయని మెడికల్ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఓ.పి.వైద్య సేవలు సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు వుంటుందన్నారు.

## రిపబ్లిక్ పెరేడ్‌కు ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ



చిత్తూరురూరల్, నవంబరు 12 ప్రభాతవార్త: జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఇంజనీర్స్ రెజిమెంట్ ఎన్‌సిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంబైన్డ్ ఎన్యూవల్ ట్రైనింగ్ క్యాంప్‌లో రిపబ్లిక్ పెరేడ్‌కు ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు క్యాంప్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఆర్.కె.భాలీ తెలిపారు. ఇందులో భాగంగా ఫైరింగ్ మెళుకువలో శిక్షణ, మ్యాప్‌రీడింగ్, పిల్డ్ క్రాఫ్ట్, బాటిల్ క్రాప్, ఫ్లాడ్ ఏరియా థీమ్, సాంస్కృతిక కార్యక్రమాల పైన శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ క్యాంప్‌లో వివిధ ప్రాంతాలు తిరుపతి, మదనపల్లి, కడప నుంచి 250 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 35(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌బస్‌నెట్, లెఫ్టినెంట్ కల్నల్ రంగనాధన్, ఎన్‌సిసి అధికారులు ప్రసాద్‌రెడ్డి, రమేష్, ఆర్మి ఉద్యోగులు బి.బి.ఛైత్రి, సత్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరు అరెస్ట్

**- ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తే వేధించాడు - సీఐ వైవీ సోమయ్య వెల్లడి**



ఓజిలి, నవంబర్ 12 ప్రభాతవార్త : వివాహితను అనుమానంతో వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో మృతురాలి భర్తతో పాటు అతని అమ్మమ్మను అరెస్ట్ చేసినట్లు నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య, ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి తెలిపారు. ఓజిలి పోలీసుస్టేషన్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. సీఐ వైవీ సోమయ్య వివరాల మేరకు, ఓజిలి మండలం రాజుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కడివేటి శ్రీలేఖ ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలో చదువు మానేసింది. అనంతరం శ్రీసిటీకి వెళ్లి పనిచేసుకునే సమయంలో చక్రతేజతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. వీరు పెద్దలను ఒప్పించి పెద్దల సమక్షంలోనే ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నారు. అయితే పెళ్లయిన కొంతకాలానికే శ్రీలేఖను భర్త చక్రతేజ అనుమానంతో చూసేవాడు. ఈ నేపథ్యంలోనే ఆమెను నాలుగు నెలల క్రితం ఆమెను హింసించి ఇంటి నుంచి తరిమేశాడు. అప్పటి నుంచి శ్రీలేఖ తన పుట్టింట్లోనే ఉంటోంది. అయితే మధ్యవర్తుల ద్వారా కాపురానికి వెళ్లాలని ప్రయత్నం చేసినా చక్రతేజతో పాటు అతని అమ్మమ్మ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదీన శ్రీలేఖ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఉరాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య, ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి తెలియజేశారు.

# ముసారతో తూర్పు మండలాలు...అన్నదాతల ఉత్సాహం



శ్రీకాళహస్తి,నవంబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పరిసరాలు రెండురోజులుగా ముసారతో వణుకుతున్నాయి. తుఫాన్లుతో భారీ వర్షాలు కురుస్తాయని ఆశించిన రైతాంగం ముసారతో ఏమౌతుందో అని ఎదురు చూస్తున్నారు. శుక్రవారం నుంచి ఈ ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది.శనివారం శ్రీకాళహస్తి మండల కార్యాలయంలో నమోదైన వర్షం గురించి విచారించగా శ్రీకాళహస్తి నవంబర్ నెల సాధారణ సగటు వర్షపాతం 330 మి.మీలు కాగా ఇప్పటి వరకు 146.6 మి.మీలు నమోదైంది. కాగా తొట్టంబేడు మండలంలో సాదారణ సగటు వర్షపాతం 331 మి.మీలు కాగా ఇప్పటి వరకు 147 మి.మీలు నమోదైంది. కాగా శనివారం శ్రీకాళహస్తిలో 31 మి.మీలు, తొట్టంబేడులో 29.6లు నమోదైనట్లు తెలిపారు. గ్రామాల్లో రైతులు వరి నారులు పోసి, దుక్కులు దున్నుతున్నారు. ఇక రైతు కష్టాలు చేతి నిండా డబ్బు వుంటే కాని వ్యవసాయం సాగని పరిస్థితి. ఇటు కూలీలు, అటు రసాయనిక ఎరువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. కొన్ని బ్యాంకులు పంట రుణాలు విరివిగా ఇస్తున్నా, మరి కొన్ని బ్యాంకులు రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇక రైతు భరోసా కేంద్రాలో విత్తనాలు, రసాయనిక ఎరువులు వున్నాయని, ప్రభుత్వం చేబుతున్నా అవి అందని ద్రాక్షలా మారాయని రైతులు వాపోతున్నారు. ఈ ముసారాతో పల్లెల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసి, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇక పట్టణంలోని స్వర్ణముఖి నదికి స్వల్పంగా వరద వస్తుంది. అయితే రెండు వంతెనల మధ్య స్వర్ణముఖి ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. వాతావరణకేంద్రం ఏమో ఈ నెల 15 వరకు వర్షాలు కొనసాగుతాయని ప్రకటించటంతో ఇక్కడి ప్రజల్లో ఆందోళన చోటు చేసుకుంది. అయితే ఈ నెల 22న స్వర్ణమ్మ హారతులకు వరద ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో రెండు రోజులుగా ఎడతెరపి లేని ముసార పట్టుకున్నా ఇళ్లలో ఫ్యాన్ లేనిదే ఉండలేక పోతున్నారు.ఆలయానికి భక్తులు మాత్రం తగ్గటం లేదు. ఇక పల్లెల్లోంచి జనం కొనుగోళ్ల కోసం పట్టణానికి పరుగులు తీస్తున్నారు. అయితే రహదారులు దారుణంగా మారాయి.ఎక్కడ రోడ్డో ఎక్కడ గుంతలో తెలుసుకోలేని దుస్థితి చోటు చేసుకుంది. వాతావరణంలో మార్పు జనాన్ని పలు సందేహాలకు అవకాశం కల్పిస్తుంది. ఎందుకు ఇలా జరుగుతుంది? ఓ వైపు వర్షం మరో వైపు కొద్ది సేపు ఎండ. వేకువ జామున విపరీతమైన చలితో జనం వణుకుతున్నారు.

**చిద్రమైన రోడ్లు:**

వర్షాలతో అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు పూర్తిగా ఛిద్రమైనాయి.అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదు. ఇక మున్సిపాలిటిలో ఒక లైటు వేయటానికి నిదుల్లేదు.ఇక రోడ్ల పరిస్తితి అగమ్యగోచరం.ముఖ్యంగా లే అవుట్, అభివృద్ధి చెందుతున్న శ్రీరామనగర్, ఎస్‌డికె నగర్‌లలో పరిస్తితి అయోమయంగా మారింది.ఆసుపత్రి నుంచి బైపాస్‌కు వెళ్ళు మార్గం ఆసుపత్రి హద్దుల వరకు తారు రోడ్డు ఉన్నా ఇటీవల కాలువల నిర్మాణానికి తవ్వి పోసిన మట్టితో రోడ్డు మాయమైంది. చెంచులక్ష్మీకాలనీ నుంచి అసలు రోడ్డే లేదు.ఇక మరో వైపు సగం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. తరువాత టెండర్లు పిలుస్తున్నారు. కానీ పైసలు వస్తాయో లేదో అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. వీధుల్లో రోడ్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

వార్త

ప్రభాతవార్తకు విలేకరులు కావలెను

తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

ఈ కేంద్రాల్లో పనిచేయుటకు విలేకర్లు కావలెను.

ఎస్.ఆర్.పురం, చిత్తూరు టౌన్, గూడూరు రూరల్, గూడూరు టౌన్, చిట్టమూరు, డక్కిలి, తిరుపతినగరంలోని పలు ప్రాంతాలు, తిరుపతి కలెక్టరేట్, ఏర్పేడు, పిచ్చాటూరు, పుంగనూరు రూరల్,

మీ పూర్తి బయోడేటాతో తేది : 14.11.2022లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880